విశేషంగా దుర్గాష్టమి పూజలు



సీఐలను సన్మానించి అమ్మవారి చిత్రపటాలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బక్కన్నపాలెం – పీఎం పాలెం రోడ్డులోని శ్రీ దుర్గాలమ్మ ఆలయ సముదాయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పోతిన మూర్తిబాబు, అప్పలరాజు, వెంకటరామారావు పూజలు చేశారు.

చంద్రంపాలెంలో దుర్గాలమ్మను పీఎం పాలెం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లు వై.రామకృష్ణ, అప్పారావు దర్శించుకున్నారు. వీరికి అర్చకులు అమ్మవారి చిత్రపటాలు అందజేశారు.

తగరపువలస: సంగివలస పోలమాంబ ఆలయంలో కొమ్మాదికి చెందిన శ్రీశివసాయి వేంకటేశ్వర బృందం చిన్నారులు కోలాటం ప్రదర్శించారు. సంతపేటలో గ్రామదేవత కొత్తమ్మతల్లిని దుర్గాదేవిలా అలంకరించారు. చిట్టివలస రెడ్డివీధి మండపంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. భీమిలి రోడ్డు ఆంధ్రా బ్యాంకు వీధి మండపంలో దుర్గా పూజ, సూర్య నమస్కారాలు, చండీ, నవదుర్గ, వనదుర్గ, నవగ్రహ హోమాలు అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి నిర్వహించారు. అన్నవరం పంచాయతీ కొత్తపేట మండపంలో వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించారు. చిప్పాడ, కొత్త మూలకుద్దు పంచాయతీల్లోని మండపాల్లో శాకాంబరిదేవిగా, పాత మూలకుద్దులో అమ్మవారిని చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు.

భీమునిపట్నం: పాత బస్టాండ్ వద్ద శ్రీనూకాంబిక ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలోని బబ్బేలమ్మ ఆదివారం మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



దుర్గాదేవి అలంకరణలో కొత్తమ్మతల్లి

నేరాలకు పాల్పడితే చర్యలు

భీమునిపట్నం: భీమిలి పరిసరాల్లో రాత్రి వేళల్లో తిరుగుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్ హెచ్చరించారు. రాత్రి వేళల్లో తిరిగే వారిని గుర్తించి ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. రాత్రి పది గంటల తర్వాత కారణం లేకుండా రోడ్లపై తిరగకూడదని సూచించారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి



కరుణాకర్‌రావు , నరిసింహమూర్తి , సత్యనారాయణ

ఆనందపురం : మండలంలోని వివిధ పంచాయతీల్లో పని చేస్తున్న ముగ్గురు కార్యదర్శులకు ఈవోపీఆర్డీలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్ – 1 కార్యదర్శులుగా తర్లువాడ పంచాయతీలో పనిచేస్తున్న కె.కరుణాకర్‌రావు, మామిడిలోవలో పనిచేస్తున్న బి.సత్యనారాయణ, ఆనందపురంలో పనిచేస్తున్న ఎస్‌వీవీ నరిసింహమూర్తి పదోన్నతి పొందారు. ఈ మేరకు ముగ్గురిని పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

వైజాగ్ మారథాన్‌లో భాగస్వాములవ్వాలి



పోస్టర్ ప్రదర్శిస్తున్న సొసైటీ సభ్యులు

మధురవాడ: సామాజిక సేవలో భాగంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ, అపోలో ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం ఎండాడ లా కాలేజీ సమీపంలోని మధురవాడ పనోరమ హిల్స్ గృహ సముదాయంలో లైఫ్ సేవింగ్ కార్యక్రమం నిర్వహించారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణారాయ్ మాట్లాడుతూ డిసెంబర్ 17న నిర్వహించనున్న సంధ్యా మెరైన్ వైజాగ్ మారథాన్‌లో నగర వాసులు పాల్గొనాలని కోరారు. సంస్థ సెక్రటరీ శ్రీనివాస్, డాక్టర్ సుమన్ దాస్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

అబ్బురపరిచిన నృత్య రూపకం



నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన మహిషాసుర నృత్య రూపకం ప్రేక్షకులను అబ్బురపరిచింది. స్థానిక జ్యోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారులు మోహన్ లక్ష్మి, సంధ్య, మన్విత, ప్రియాంక, సంజన, యశస్విని, యస్మిత నృత్యం చేయగా కె.మురళీ గోవింద్ నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేటలో ఈ నెల 11న దగ్ధమైన సత్యశ్రీ సోఫా రిపేర్ షాపు బాధితులకు తగరపువలస ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి సంఘం తరఫున ఆదివారం సాయం అందించారు. బాధితుడు భగీరథ విజయవర్ధన్ కుటుంబానికి రూ.10 వేలు అందించారు. చర్చి ప్రెసిడెంట్ జాన్‌ప్రకాష్, జోసఫ్ జేమ్స్, పాస్టర్ విలియం సుమిత్‌బాబు, శామ్యూల్‌రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

హెచ్‌సీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తగరపువలస: విజయ దశమి సందర్భంగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం హెచ్‌సీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. అక్కరమాని లోవరాజు, జల్లు తిరుపతిరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, కిషోర్, హరి, రాజీ, ధర్మతేజ, సోమశేఖర్, సోను పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణానికి ఎంతో మేలు

మధురవాడ: పర్యావరణ పరిరక్షణలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, అందరూ మొక్కలు నాటాలని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు సూచించారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస జేఎన్‌ఎన్‌యూఆర్ఎం రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆదివారం ఆయన మొక్కలు నాటారు.

డాక్టర్ హరికృష్ణకు ఘన సన్మానం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటకు చెందిన ఈఎన్‌టీ వైద్యుడు గొండేల హరికృష్ణ ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటిండెంట్‌గా నియమితులుకావడంతో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు ఆయనతోపాటు తండ్రి అప్పారావును చిట్టివలస హైస్కూల్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహన్‌రావు, సొసైటీ గౌరవ అధ్యక్షుడు దత్తి ఈశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహన్‌రావు, రేక అప్పారావు, బంటు అప్పారావు, టీఆర్ అంబేడ్కర్, వైవీ రమణ, మునకాల ఆదినారాయణ రెడ్డి, సరగడ ఈశ్వరరావు, చిల్ల ఆదినారాయణరెడ్డి, ఉప్పాడ రాము తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయక అన్నదాతల ఆందోళన



పొట్నూరులోని గులమజ్జి వారి కళ్లాల్లో పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్

పద్మనాభం: మండలంలోని పొట్నూరు గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదు. దీంతో వరి పంటకు సాగునీరు అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గులమజ్జి వారి కళ్లాలు, విశ్వంరాజు చెరువు కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల వీటి కింద ఉన్న వ్యవసాయ పంపుసెట్లు పనిచేయక సుమారు 45 ఎకరాల్లోని వరి పంట సాగునీటి కొరతతో విలవిల్లాడిపోతోంది. చిరు పొట్ట, పాలు పోసుకునే దశలో ఉన్న పంట ఎండిపోతోందని, కొద్ది రోజులుగా ఎండల తీవ్రత కూడా ఎక్కువగా ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను మార్పుచేయాలని రైతులు కోరుతున్నారు.